

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు


# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 7 జనవరి 2025 | RANGAREDDY


## మెట్రోకు అదనపు బోగీలు

**పుణె కోచ్ ఫ్యాక్టరీ నుంచి తెచ్చేందుకు మెట్రో సంస్థ సన్నాహాలు**

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోలో అదనపు బోగీల (కోచ్‌లు) ఏర్పాటుకు ఎట్టకేలకు హెచ్ఎంఆర్ఎల్ దృష్టి సారించింది. ఇందుకుగాను రద్దీగా ఉండే మార్గాలను తొలి దఫా అందుబాటులోకి తీసుకు రానున్నారు. అమీర్‌పేట, రాయదుర్గ్, జేబీఎస్ పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ వంటి స్టేషన్ల పరిధిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, నాలుగు అదనపు కోచ్‌లను నాగ్‌పూర్, పుణె మెట్రో నుంచి లీజుకు తీసుకోనున్నట్లుగా తెలిసింది. గడిచిన కొంతకాలంగా నిత్యం ఐదున్నర లక్షలకు పైగా ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసు సమయాల్లో నాగోల్-రాయదుర్గ్ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటున్నది. ఏడాదిన్నర కాలంగా బోగీలను పెంచాలని డిమాండ్ చేస్తున్నా... అటు మెట్రో కానీ, ఎల్ అండ్ టీ కానీ పట్టించుకోలేదు. తాజాగా ప్రయాణికుల ఒత్తిడి మేరకు బోగీలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. తొలి దఫా నాలుగు బోగీలను లీజ్ ప్రాతిపదికన తీసుకువచ్చేలా చర్యలు చేపట్టింది. దీనికోసం పుణె మెట్రో నుంచి ఇంజన్ రహిత బోగీలను తీసుకువస్తున్నట్లు సమాచారం.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్**

**కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా**

ఆదిబట్ల, జనవరి 6 : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డీ కిషన్, జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని, డబుల్ బెడ్‌రూంలు, ఇండ్ల స్థలాలు, కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలన్నారు. ఆదివారం, పండుగలకు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్మికులకు రెయిన్ కోట్లు, స్వెట్టర్లు, సబ్బులు, బట్టలు, కొబ్బరి నూనె, ఇతర రక్షణ సామగ్రి అందజేయాలన్నారు. మృతి చెందినవారి స్థానంలో వారి కుటుంబ సభ్యులనే నియమించాలన్నారు. డ్రైవర్లకు రూ.19,500 వేతనం చెల్లించాలన్నారు.ఈ ధర్నాకు సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి యాదగిరి, సీఐటీయూ ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల నర్సింహ, తులసీగారి నర్సింహ, మండల సత్యనారాయణ, జే పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయాంజాల్, పెద్ద అంబర్‌పేట, ఆమనగల్లు, షాద్‌నగర్, శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహిస్తున్న ధర్నాను అడ్డుకుంటున్న పోలీసులు

# కాంగ్రెస్ మోసంపై కన్నెర్ర..

**రైతు భరోసా రూ.15 వేల నుంచి రూ.12 వేలకు తగ్గింపుపై ఉమ్మడి జిల్లాలో పెల్లుబికిన ఆగ్రహం**


ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, నిరసనలు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసే తీరును ఎండగట్టిన బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని పెద్ద ఎత్తున నినాదాలు

*కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు, అన్నదాతలు భగ్గుమన్నారు. సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలతో పాటు నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తహసీల్దార్లకు వినతి పత్రాలను అందజేసి, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టారు. 50 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి, పూర్తి స్థాయిలో చేశామని గొప్పలు చెప్పకొంటున్నదన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... ఏడాది గడిచినా రైతు భరోసా ఊసెత్తలేదని.. స్థానిక సంస్థల ఎన్నికలొస్తున్నాయని రైతు భరోసా రాగమెత్తుకున్నదని విమర్శించారు. ఏడాదికి రూ. 15 వేలంటూ ఒకసారి, కాదు.. కాదు.. రూ. 12 వేలు అంటూ డ్రామాలాడుతున్నదని ధ్వజమెత్తారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రైతులను నట్టేట ముంచుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పొంతనలేని మాటలు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకుల తీరును చూస్తున్న జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి.. కాబట్టి రైతు భరోసా పథకాన్ని ముందలేసుకున్నారని విమర్శించారు. ఎన్నికలు వస్తే తప్పా, కాంగ్రెస్ ప్రభుత్వానికి పథకాలు గుర్తుకొచ్చేలా లేవని ఆరోపించారు. ఏ ఒక్క పథకంపైనా స్పష్టత లేదని, పేరుకు మాత్రం ఫ్రీ బస్సు పథకాన్ని ప్రారంభించారన్నారు. ఏ పల్లెకు వెళ్లినా కరెంట్ సక్రమంగా ఉండడం లేదని, 24 గంటల ఉచిత కరెంట్ అన్న మాటలు ఉత్తుత్తివేనన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, రూ. 4 వేల పింఛన్, మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం పథకాలు ఏమైనట్టు అని ప్రశ్నించారు. వడ్లకు బోనస్ ఇస్తామన్న మాటలు బోగస్ అయ్యాయని, కూరగాయాలకు ధరలే లేవని, రైతులు గోస పడుతున్నారని వాపోయారు. కేసీఆర్ ప్రభుత్వంలో సాగు సంబురంగా సాగిందని, రేవంత్‌రెడ్డి పాలన వచ్చాక రైతన్న పరిస్థితి అధోగతిపాలయ్యిందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించారు.*


*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*




షాద్‌నగర్ : ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


4లో..




మర్పల్లి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



కడ్తాల్ : మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్ఎస్ శ్రేణులు

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

రంగారెడ్డి, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్‌లు, ఓటర్ల వివరాలను తెలిపారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 36, 62, 221 మంది ఉన్నారు. వీరిలో 18,83,270 మంది పురుషులు, 17,78,516 మంది స్త్రీలు ఉన్నారు. 433 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,501పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | స్త్రీలు | మొత్తం ఓటర్లు. |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 359 | 1,72,820 | 1,70,121 | 3,42,975 |
| ఎల్‌బీనగర్ | 577 | 3,14,613 | 2,91,386 | 6,06,132 |
| మహేశ్వరం | 542 | 2,88,519 | 2,75,461 | 5,64,046 |
| రాజేంద్రనగర్ | 547 | 3.20,368 | 2,98,652 | 6,19,056 |
| శేరిలింగంపల్లి | 639 | 4,04,111 | 3,61,666 | 7,65,921 |
| చేవెళ్ల | 298 | 1,37,156 | 1,37,147 | 2,74,308 |
| కల్వకుర్తి | 271 | 1,24,414 | 1,22,107 | 2,46,523 |
| షాద్‌నగర్ | 268 | 1,21,271 | 1,21,976 | 2,43,260 |

### వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్, జనవరి 6 : ప్రత్యేక ఓటర్ నమోదు 2025లో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను వికారాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ విడుదల చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఓటరు నమోదు జాబితాలో మొత్తం 10 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. 4 నియోజకవర్గాల్లో 1133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ముసాయిదా జాబితాలో 10,00,032 మంది ఓటర్లు ఉన్నారని ఇందులో 4,92,613 మంది పురుషులు, 5,07,644 మంది స్త్రీలు ఉండగా, 45 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గంలో 2,71,060 మంది ఓటర్లకు గాను 1,35,522 మంది పురుషులు, 1,35,528 మంది స్త్రీలు, 10 మంది ఇతరులు ఉన్నారన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,34,933 మంది ఓటర్లు నమోదు కాగా, 1,16,388 మంది పురుషులు, 1,18,524 మంది స్త్రీలు, 21 మంది ఇతర ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,47,783 ఉండగా, 1,19,824 మంది పురుషులు, 1,27,952 మంది స్త్రీలు, 7 గురు ఇతరులు ఉన్నట్లు గుర్తించారు. కొడంగల్ నియోజకవర్గంలో 2,46,526 మంది ఓటర్లలో 1,20,879 మంది పురుషులు, 1,25,640 మంది స్త్రీలు, ఏడుగురు ఇతరులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 549 సర్వీస్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. పరిగిలో 247, వికారాబాద్ 79, తాండూరు 53, కొడంగల్‌లో 170 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వివరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నెహత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ డి.ఉష, సిబ్బంది పాల్గొన్నారు.



బంట్వారం : కోట్‌పల్లి గ్రామంలో పంట పొలాల్లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

### రైతుభరోసాలో కోతలెందుకు ?



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదికి ఎకరాకు రూ.10వేలు ఇచ్చిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని మాట ఇచ్చి.. ఇప్పుడు రూ.12వేలు ఇస్తామనడం సిగ్గు చేటు. రైతుల కోసం అది చేస్తాం.. ఇది చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు రైతు భరోసాలో కోతలెందుకు విధిస్తున్నట్లు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేసింది. కాంగ్రెస్ మాత్రం నట్టేట ముంచుతున్నది. పంటల కొనుగోలులోనూ దళారులు, వ్యాపారులదే హవా నడుస్తున్నది. రైతులను ఇబ్బందులకు గురిచేసిన ఏ పార్టీ మనుగడ సాధించలేదు.

– మొద్దు అంజిరెడ్డి, రాష్ట్ర ఉత్తమ రైతు (ఇబ్రహీంపట్నం రూరల్)